కథ


# నిప్పుల కుంపటి


- సుంకోజి దేవేంద్రాచారి

నిలువెత్తు కన్నీటి బొట్టులా ఉందామె. మాట కదిపితే చాలు కన్నీటి ప్రవాహమై మనల్ను ముంచెత్తేలా ఉంది. అయినా ఆమె మాట్లాడటం లేదు
నిప్పు కణికలా ఉందామె. తాకితే చాలు మనల్ని దగ్ధం చేసేలా ఉంది. అయినా ఆమె స్పందించడం లేదు.

వ్యక్తం కాని దుఃఖంతో, వ్యక్తం కాని బాధతో అలజడిగా ఉందామె. మట్టి కుండలాగ, ఏ ఆభరణం లేకుండా, పాత చీర రవికెతో ఉన్న ఆమె పేరు శ్రీదేవి. వయసు యాభైఏళ్లకు కాస్త అటు ఇటుగా ఉండచ్చు. మంచానికి తల ఆనించి కింద కూర్చుని ఉందామె.

గుంతగా అయిపోయిన పాత నులకమంచంమీద ఒకతను పడుకుని ఉన్నాడు. అతనికి పక్షవాతం సోకిందనడానికి గుర్తుగా ఎడమవైపు మూతి ఒక పక్కకు పోయింది. మంచానికి కుడివైపున పొడవాటి కర్ర ఆనించి ఉంది. చెట్టు నీడలో నులక మంచంమీద విల్లులా పడుకుని ఉన్న అతని కళ్ళు శూన్యంలో దేనినో వెదుకుతున్నట్టున్నాయి. అతని ముఖంలో ఎలాంటి భావాలు లేవు. ఇలా ఎంతకాలం జీవించేది అనే ప్రశ్నమాత్రం కనిపిస్తోంది! అతను రాజయ్య. శ్రీదేవి భర్త.





ఊరంతా ఏదో రహస్యాన్ని దాచుకున్నట్టుగా ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో ఏమో అనే అనుమానాస్పద వాతావరణం. ఎవరిళ్లలో వారు కూర్చుని గుసగుసలు పోతున్నారు. వందగడప ఉన్న ఆ పల్లె రాజుకుంటున్న బొగ్గుల కుంపటిలా ఉంది.

పడుకున్న భర్త మీదుగా గుడివేపు చూసింది శ్రీదేవి. గుడి తలుపులు తెరిచి ఉన్నాయి. గుడిలోపల ఉన్న నల్లనయ్య గోపాల కృష్ణుడు అస్పష్టంగా కనిపిస్తున్నాడు. ఆయనను చూస్తుంటే శ్రీదేవి కళ్లముందు ఏడాది క్రితం జరిగిన సంఘటలు కదలాడుతున్నాయి. ఆమె ఆలోచన్ల నిండా ఆనాటి విషయాలు సుడులు తిరుగుతున్నాయి.

ఆ రోజు కూడా ఈరోజులాగే ఆకాశం నిర్మలంగా ఉంది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. కానీ ఊరే అలజడిగా ఉంది. ఆందోళనగా ఉంది. ఆనందంగా ఉంది. అధికారులతో కలసి ఎమ్మెల్యే నాగులయ్య ఊర్లోకి వచ్చాడు. అతను ఆరడుగుల పొడవున్నాడు. గంజిపెట్టిన తెల్లటి ఖద్దరు దుస్తులు ధరించాడు. తలకు రంగేశాడు. మెడలో బంగారు చైను, ఎడమచేతికి బంగారు రంగులో ఉన్న వాచీ, కుడి చేతికి బ్రాస్‌లైట్ ఉన్నాయి. వీటన్నింటికి అదనపు ఆకర్షణ అతని ముఖంలో చెరగని నవ్వు. ఎమ్మెల్యే రావడంతో ఊర్లో హడావుడి మొదలయింది. ఎమ్మెల్యే కృష్ణుని గుడిలో కొబ్బరి కాయ కొట్టాడు. రాజయ్య ఇచ్చిన హారతిని కళ్లకు అద్దుకుని పళ్లెంలో వందరూపాయల నోటు వేశాడు. అధికారులు కూడా కృష్ణుడికి నమస్కారం పెట్టారు. తర్వాత గుడిముందు చెట్టుకింద నులక మంచాల్లో కూర్చున్నారు. అధికారులతో పాటు పోలీసులు కూడా ఉన్నారు.

ముందుగా ఎమ్మెల్యే నాగులయ్య మాట్లాడడం మొదలు పెట్టాడు. ''నా ప్రియమైన ప్రజలారా.. మీరు నాకు ఓట్లేసి గెలిపించారు. అందుకు చాలా ఆనందంగా ఉంది. నన్ను గెలిపించిన మీ రుణం తీర్చుకుంటాను. ఆ రోజే చెప్పాను. ఈ రోజు మళ్లా చెబుతున్నాను. మీ అందరూ లక్షాధికారులు, కోటీశ్వరులు కావాల. అదే నా కోరిక. హైదరాబాదులో మన ముఖ్యమంత్రిగారితో మాట్లాడాను. మాది చాలా పేద ప్రాంతం. మా పక్కన ఉండేవోళ్లు చదువు సంధ్యల్లేనోళ్లు. వోళ్లకు ఏదైనా మార్గం చూపించండి అని వేడుకున్నేను. నా మాట ఆలకించిన ముఖ్యమంత్రిగారు, ఇక్కడ 'సెజ్' పెట్టేదానికి ఒప్పుకున్నారు. సెజ్ అంటే పెద్ద ఫ్యాక్టరీ. చాలామందికి దాంట్లో ఉద్యోగాలు కూడా వస్తాయి. మీ పిల్లకాయలంతా ఎక్కడికో దూరప్రాంతాలకు పోయి ఉద్యోగాలు చేసుకునే అవసరం లేకుండా ఈన్నే ఉండచ్చు. సెజ్ కోసం చాలా నేల కావాల. గవర్నమెంట్‌ది పోరంబోకు నేల ఉంది. అది చాలదు. అందుకని మీ నేల కూడా తీసుకుంటా ఉండారు. దీనికి ఎకరాకు పుంజకు మూడు లక్షలు. మెట్టకు రెండున్నర లక్షలు ఇస్తారు. మామూలుగా అమ్మితే

ఎకరాకు యాభైఅరవై వేలకన్నా మించి రాదు. ఇప్పుడు పొలాలు ఇచ్చినారంటే బాగుపడతారు. ఈ విషయాలన్నీ ఇంతకుముందే మీతో మాట్లాడినాం. ఇందుకు సహకరిస్తాండే మీ అందరికీ కృతజ్ఞతలు.'' అన్నాడు.

ప్రజలంతా నిశ్శబ్దంగా ఉన్నారు. అధికారులు, ఎమ్మెల్యే, ఆయన పక్కన దొరస్వామి కూర్చొని ఉండాడు. దొరస్వామి పూర్వీకులు ఆ ఊరి వాళ్లే. వాళ్లకు అక్కడ యాభై ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం ఆయన చెన్నయ్‌లో ఉంటా వ్యాపారాలు చేస్తున్నాడు. తన మొత్తం భూమికి ఎంత డబ్బు వస్తుందో లెక్కలు వేసుకుంటూ ఆనందంగా ఉన్నాడతను.

పెద్ద చెంబులో టీ తీసుకొచ్చి గ్లాసుల్లో పోసి నాయకులకు, అధికారులకు ఇచ్చింది శ్రీదేవి. తమ వెంట తెచ్చుకున్న బాటిళ్ళలోని నీళ్లు తాగాక టీ తాగారు. ఒక అధికారి చేతిలో ఓ కాగితం పట్టుకుని లేచాడు.

''మన ఎమ్మెల్యే నాగులయ్యగారికి నమస్కారాలు. అలాగే ఇక్కడకు వచ్చిన పెద్దలందరికీ నమస్కారాలు. మన ఎమ్మెల్యేగారు ఇప్పుడే అన్ని విషయాలు చెప్పారు.'' అంటూ అప్పటి వరకూ ఎమ్మెల్యే చెప్పిన విషయాలనే మళ్లీ ఓసారి, అంతకంటే విపులంగా చెప్పాడు. ఇదీ దాని సారాంశం 'సెజ్ అంటే స్పెషల్ ఎకనమికల్ జోన్. అంటే ప్రత్యేక ఆర్థిక మండలి. అక్కడ కొన్ని కంపెనీలు వెలుస్తాయి. వాటిద్వారా చాలా ఉత్పత్తులు జరుగుతాయి. ఆ కంపెనీల్లో స్థానికులకు ఇంటికో ఉద్యోగం ఇస్తారు. అయితే తమ భూములన్నీ కంపెనీకి అమ్మాలి. మామూలు ధరకన్నా నాలుగైదు రెట్లు ఎక్కువ ధర చెల్లిస్తారు'

ఈ విషయం గురించి అప్పటికే నాలుగు నెలలుగా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. అధికారులు, రాజకీయ నాయకులు మీటింగులు పెట్టి చెప్పారు. కొందరు ప్రజలు తమ భూములు అమ్మడానికి వ్యతిరేకించారు. దొరస్వామిలాంటి భూస్వాములు అమ్మడానికి ఉత్సాహం చూపారు.

అధికారి తనచేతిలోని కాగితాన్ని చూసి ఎవరి పేరుతో ఎంత భూమి పట్టా ఉందో చదవడం మొదలు పెట్టాడు. అందరూ అంతవరకూ దానికోసమే ఎదురు చూస్తున్నారు. ''గోపాలకృష్ణుడి గుడి మాన్యం భూమి నాలుగెకరాల మెట్ట. పంచాయతీ పేరుతో ఉంది'' అని చదివాడు అధికారి.

ఆ మాటలు వింటూనే శ్రీదేవి, రాజయ్య ఉలికిపడ్డారు. వాళ్ల పాతికేళ్ల కొడుకు క్రిష్ణయ్య భయపడ్డాడు.

అందరి ఆస్తుల వివరాలు చదివాక చివర్లో ''ఇప్పుడు చెప్పాము కదా. వీరందరికీ రెండు నెలల్లో ఇక్కడకే వచ్చి మేం చెక్కులు ఇస్తాం. ఇక మీరు మీ పొలాల్లోకి పోవడానికి వీల్లేదు. ఎలాంటి పంటలు పండించడానికి వీల్లేదు. అవంతా సెజ్ భూములు.'' అన్నాడు అధికారి.

''సార్.. మాన్యం భూమిని మా తాతలకాలం నుంచి మేమే చేసుకుంటా ఉండాం సార్'' అన్నాడు క్రిష్ణయ్య.

**వాళ్లు చెప్పినట్టే రెండు నెలల్లో చెక్కులు ఇచ్చారు. మాన్యం భూమి నాలుగెకరాలకు సంబంధించిన డబ్బు పంచాయతీకే పోయింది. తమ కుటుంబానికున్న ఆధారం పోయిందని శ్రీదేవి, రాజయ్య పొగిలిపొగిలి ఏడ్చారు. వాళ్ల కొడుకు క్రిష్ణయ్య మాత్రం ఎవరితో మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు. వారం రోజులు గడిచాయి. శ్రీదేవి, రాజయ్య ఇంకా దుఃఖంలోంచి బయటపడలేదు. ఓ రోజు రాత్రి తమ ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకున్నాడు క్రిష్ణయ్య. చెట్టంత కొడుకు, తమను వృద్ధాప్యంలో సాకి సంతరిస్తాడనుకున్న కొడుకు, బతుకు భయంతో శవంలా మారడంతో శ్రీదేవి, రాజయ్య తల్లడిల్లి పోయారు.**

''ఎవరు నువ్వు?'' అన్నాడు అధికారి.

''పూజారి రాజయ్య కొడుకు'' గుంపులోంచి ఎవరో సమాధానం చెప్పారు.

''అవును సోమీ..మా తాతల కాలంనించీ మాకు ఆదరవు ఈ నాలుగెకరాలే సోమీ.. దాంట్లో పండేదాంతోనే మేం బతకతాండాం. ఆ గుళ్లో కిట్టయ్యకు దీపం పెడతాండాం'' అన్నాడు రాజయ్య గుడిలోని కృష్ణుడి వేపు చేతిని చూపిస్తూ.

''మీరు బ్రాహ్మణులా?'' అధికారి.

''కాదు సోమీ.. గొల్లోల్లం''

''గొల్లోల్లు పూజార్లా!'' అధికారి ఆశ్చర్యపోయాడు.

''కిట్టయ్య అంటే గోవుల కాసేవాడే కదా సోమీ.. మేమూ వాళ్లమే. కిట్టయ్య మా దేవుడే కదా'' అన్నాడు రాజయ్య.

ఆ మాత్రం తెలీదా అన్నట్టు కొందరు కిసుక్కున నవ్వారు.

''సరే.. సరే... నీదేకులమైతే మాకేంగానీ, ఈ నాలుగెకరాల స్థలం పంచాయతీ పేరుతో ఉంది. కాబట్టి పదిలక్షల రూపాయలు కూడా పంచాయతీకే పోతాయి. నీకు రావు'' అన్నాడు అధికారి.

''అట్లాంటే ఎట్లాసార్..మామింద దయచూపండి సార్'' అంది శ్రీదేవి.

''మీకు నేను న్యాయం చేస్తాలేమ్మా.. భయపడద్దండి'' అంటూ ఎమ్మెల్యే హామీ ఇచ్చాడు.

తర్వాత కాసేపటికి అధికారులు, నాయకులు వెళ్లిపోయారు.

వాళ్లు చెప్పినట్టే రెండు నెలల్లో చెక్కులు ఇచ్చారు. మాన్యం భూమి నాలుగెకరాలకు సంబంధించిన డబ్బు పంచాయతీకే పోయింది. తమ కుటుంబానికున్న ఆధారం పోయిందని శ్రీదేవి, రాజయ్య పొగిలిపొగిలి ఏడ్చారు. వాళ్ల కొడుకు క్రిష్ణయ్య మాత్రం ఎవరితో మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు. వారం రోజులు గడిచాయి. శ్రీదేవి, రాజయ్య ఇంకా దుఃఖంలోంచి బయటపడలేదు.

ఓ రోజు రాత్రి తమ ఇంటిముందున్న చెట్టుకు ఉరేసుకున్నాడు క్రిష్ణయ్య.

చెట్టంత కొడుకు, తమను వృద్ధాప్యంలో సాకి సంతరిస్తాడనుకున్న కొడుకు, బతుకు భయంతో శవంలా మారడంతో శ్రీదేవి, రాజయ్య తల్లడిల్లి పోయారు. వాళ్ల ఏడుపుతో ఆ వూరు వూరంతా దద్దరిల్లింది. తమ కాగుల్లో, పెట్టెల్లో దాచుకున్న పొలం డబ్బులను చూసి రైతులు భయపడ్డారు. బతుకు మీద భయం మొదలయింది.

పొలం పోయినప్పుడు మొదలయిన ఏడుపు, కొడుకు చనిపోయాక మరింతగా పెరిగి దాదాపు రెండు నెలల పాటు ఆగలేదు శ్రీదేవిలో. ఏడ్చి ఏడ్చి ఆమెలో భారం తగ్గిందో.. ఏడ్వడం వలన ప్రయోజనం లేదనుకుందో.. ఏడ్చినా పోయినవి తిరిగి రావనుకుందో.. ఏమయితేనేం ధైర్యం తెచ్చుకుంది.

రోజూ సాయంత్రమయితే చాలు.. పక్కనే ఉన్న పొలాల్లోకి పోతుంది. గులాబీ తోటలు, మల్లె తోటలు ఉన్నాయి. వాటిల్లోంచి గులాబీలు, మల్లెలు కోసుకొస్తుంది. వాటిని పడుకునే ముందు భక్తిగా మాలకడుతుంది. చీకటితోనే లేచి స్నానం చేసి గుడికి వెళ్తుంది. గుడిలోపల, బయట కసువూడుస్తుంది. గుడిముందు కళ్లాపి చల్లి ముగ్గు వేస్తుంది. దేవుని దగ్గర దీపం పెట్టి ఆయనకు ఎదురుగా కూర్చుంటుంది. భక్తులు గుడికి రావడం పెరిగారు. చేతిలో డబ్బు ఆడుతున్న వారు హారతి పళ్లెంలో ఐదూ, పది వేస్తున్నారు. ఊరున్నంతవరకూ తమ ఇద్దరికీ జీవనం భయం లేదనుకుంది శ్రీదేవి.

అయితే రాజయ్యలో మునుపటి ఉత్సాహం లేదు. ఏ పని పట్లా ఆసక్తి లేదు. ఏం తింటున్నాననే స్పృహ కూడా లేదు. నిర్వికారంగా ఉంటున్నాడు. ఇంటిముందు చెట్టుకింద నులకమంచం మీద పడుకుని తమ కొడుకు ఉరేసుకున్న కొమ్మనే చూస్తూ ఉంటున్నాడు.

''ఏంబా.. ఎంత సేపూ పొనుకోనుండేదేనా.. లేసి తిరుగులాడచ్చు కదా.. అట్ల పోయి కట్టో కంపో కొట్టుకోనొస్తే పొయ్యిలోకి పనికొస్తాయి కదా.. ఒగ దాన్ని అన్నీ చూసుకోవాలంటే యాడవుతాది?'' అంది శ్రీదేవి.

రోజూ శ్రీదేవి అరుస్తుండటంతో ఒకరోజు లేచి, ఇంట్లో కొడవలి తీసుకుని పొలాలవైపు బయలుదేరాడు రాజయ్య. తనకు ఆ పల్లె చుట్టుపక్కల దారులన్నీ కొట్టిన పిండే. గుట్టలన్నీ ఎక్కి దిగినవే. ఏ గుట్టలో ఎలాంటి కంపచెట్లుంటాయో బాగా

తెలుసు. పల్లెకు తూర్పుగా ఉండే దారింటీ పోతున్నాడు. నడుస్తున్నా మనసులో తన కొడుకే మెదులుతున్నాడు. పల్లెకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే గుట్ట దగ్గరకు పోయాడు. అక్కడ కంపలుకొడతా ఉండగా ఎవరివో మాటలు వినిపించాయి. మాటలు వచ్చిన వేపు వెళ్లాడు రాజయ్య.

దాదాపు పదిహేనుమంది గుట్టకు అటుపక్కన ఏదో పని చేస్తున్నారు. వారేం చేస్తున్నారో రాజయ్యకు అర్థం కాలేదు. మనుషులతోపాటు ఏదో ట్రాక్టర్‌లాంటిది ఉందక్కడ. రాజయ్య గబగబా నడచుకుంటూ అక్కడకు వెళ్లాడు. తమ వూరి వాళ్లు ఇద్దరున్నారక్కడ. మిగిలిన వారంతా కొత్తవాళ్లే. జే.సీ.బీ.తో చదును చేస్తున్నారు. కళ్లద్దాలతను చేతిలో కాగితాలు పట్టుకుని చెప్తుంటే కొందరు నేలమీద మార్కింగ్ చేస్తున్నారు. జేసీబీ చదునుచేసుకుంటూ పోతుంటే కొందరు గుంతలు తవ్వుతున్నారు. మరి కొందరు ఆ గుంతల్లో వాటిల్లో నిలువెత్తు సిమెంట్ స్తంభాలు నాటుతున్నారు.

''ఏం పూజారి మామా.. ఇట్లొచ్చినావు''తమ వూరివాడు ఒకడు పలకరించాడు.

''ఏంచేస్తాండారు?'' అడిగాడు రాజయ్య. అక్కడ ఏంచేస్తున్నారో అర్థం కావడం లేదతనికి.

''ఫెన్సింగ్'' అన్నాడు కళ్లద్దాలతను.

అర్థం కానట్టు ముఖం పెట్టాడు రాజయ్య.

''మామా.. తోటలకు మనం కల్లేస్తామే.. అట్ల..'' అన్నాడు తమ వూరివాడు.

''కల్లెందుకురా?''

''ఈ స్థలమంతా కొనేసినాం కదా..! ఇంగ మీరు ఇక్కడికి రాగూడదు. మా స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తాం'' అన్నాడు మొదట సమాధానం చెప్పినతను.

''గుట్టలు, చెరువులు..'' అంటూ ఆపేశాడు రాజయ్య.

''అన్నీ ఉంటాయి. అయితే వాటి చుట్టూ ఫెన్సింగ్ వేసేస్తాం. మీరు పోయివచ్చే దోవ మాత్రమే ఉంటుంది'' అన్నాడతను నవ్వుతూ.

రాజయ్యకు ఏం అర్థమయిందో ఏమో.., మౌనంగా వెనుదిరిగాడు. కొట్టిన కర్రలను తీసుకోలేదు. నేరుగా ఇంటికొచ్చాడు. ఉత్త చేతులతో వచ్చిన భర్తను చూసి ఆశ్చర్యపోయింది శ్రీదేవి.

''ఏంబా.. గమ్మున వచ్చినావే? కట్టెలు తేలేదా?'' అడిగింది.

రాజయ్య సమాధానం చెప్పకుండా మంచం మీద పడుకున్నాడు. ఎండ చురుగ్గా ఉంది.

పొలాలు అమ్మేయడంతో రైతులంతా ఖాళీగా ఉన్నారు. చాలామంది తమ పశువులను కూడా అమ్మేశారు. కొందరు నగరాలకు, పట్టణాలకు పోయే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎలాంటి పనీలేకపోవడంతో వయసు పైబడ్డ వాళ్లంతా ఇళ్లముందు పందిరికింద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. కొందరు కృష్ణుడి గుడి వద్ద అరుగుమీద కూర్చోనున్నారు. వాళ్ల మాటలు ప్రవాహంలా సాగుతున్నాయి.

''మీకేమో పట్టా భూమని డబ్బిచ్చినారు. మాది డికెటి భూమి కదా. ఈమంటా ఉండారే. ఎట్ల?''

''ఎట్లంటే ఏం చేస్తాం? మాకూ నాలుగెకరాలుంది డికెటి నేల''

''డికెటి పట్టా ఇచ్చి పదేండ్లయింది. దానికిముందే నాలుగేండ్ల నుంచి దాంట్లో చెనిగి ఏస్తా ఉన్నేం. ఇప్పుడు అది గవర్మెంటు జాగా.. దుడ్డు ఈమంటే ఎట్ల?''

''అందుకే గదా.. అందరం మొన్న ఎమ్మెల్లే దెగ్గిరికి పోయిన్నింది. ఆయప్ప మనగ్గూడా ఇప్పిస్తానని మాటిచ్చినాడు కదా''

''మీరేమో ఉన్నికాడికి అమ్ముకోని ఏ తిరపతో, మద్రాసో పోతార ప్పా.. చేరడు జాగా లేనోళ్లం. మా బతుకులేం కావాల''

''నిజమేరా.. మమ్మల్నేం జేయమంటారో చెప్పండి..''

''మీగ్గూడా ఈడ కట్టే ఫేక్టరీలో ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నేరు కదరా''

''ఏం ఉద్యోగాలిస్తారు సోమీ.. మా ఇండ్లల్లో చదువుకున్నోళ్లు ఎవురుండారు. కూలి చేస్తే కుండగాలాల, లేకుంటే ఎండగాలాల. అట్లా బతుకులు గదా మాయ్యి.. మీకు తెలీందేముండాది''

''ఇప్పటికి సమచ్చరమాయ.. ఇంగా ఏమీ కట్టలా. ఊరు చుట్టూరా మనం బూముల్లోకి పోకుండా కంచె ఏసినారు, అంతే! నాకయితే ఫేక్టరీలొస్తాయని నమ్మకం లేదు''

''ఆ ఫేక్టరీలేవో పోరంబోకు బూముల్లో పెట్టుకోని మనోళ్లకు ఉద్యోగాలీయచ్చు కదా? ఇదంతా మనల్ను ముంచేటిగానే ఉండాది''

''మాకొచ్చిన దాంట్లో సగం అప్పులకే పాయ. కొడుకులు ముగ్గురూ వాటాలేసుకునేలకు మనిషికి యాభైవేలుగూడా రాలా! ఆడబ్బుతో ఎట్ల బతికేది? ఎట్ల బిడ్డల్ని సాకి సంతరించేది?''

ఇలా రకరకాలుగా మాటలు దొర్లుతున్నాయి. ఇంతలో పలక శబ్దం వినిపించింది. దాంతో పాటు మాదిగ రాముడు వచ్చాడు. పలక కొట్టేది ఆపి ''అందరూ ఇనండీ.. రేపు పద్దన్నే పదిగంటలకు ఎమ్మెల్లే, ఆపీసరు వస్తాండారు. అందరూ ఇండ్లకాన్నే ఉండాలంట'' అన్నాడు గట్టిగా.

గుడిముందు ఉన్న వాళ్లు, ఇళ్లల్లో ఉన్న వాళ్లు బయటొచ్చి రాముడిని చుట్టు ముట్టారు. ఎందుకు, ఎందుకు అని అడిగారు. రాముడు తనకు తెలీదని చెప్పాడు. పలక దరువేసుకుంటూ వెళ్లిపోయాడు.

అందరిలో ఆందోళన. శ్రీదేవికి ఎందుకో కళ్లు చెమర్చాయి. తడి కళ్లను దాచుకోవడం కోసం ఇంట్లోకి వెళ్లింది. రాజయ్య నులకమంచంమీద బోర్లా పడుకున్నాడు.

ఆ రాత్రంతా వూరు అలజడిగానే ఉంది. రేపు ఎమ్మెల్యే ఎందుకు వస్తున్నాడు? ఏం చెప్పబోతున్నాడు? అనేది ఎవ్వరికీ అర్థం కావడం లేదు. ఎవరికి


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్: 040 - 23747777, 9391999999

FREE online Registration &
Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట | నెల్లూరు
కూకట్‌పల్లి | తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు
విజయవాడ | (చెన్నయ్) టి.నగర్
గుంటూరు | బెంగుళూర్
తెనాలి | సేలం
విశాఖపట్నం | మధురై
రాజమండ్రి | వెల్లూరు
కాకినాడ | తిరుచి
ఖమ్మం | పాండిచ్చేరి
ఒంగోలు | ఈరోడ్
 | అనంతపూర్

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


తోచింది వారు చెప్తున్నారు. ఆ రాత్రి ఎవ్వరూ నిశ్చింతగా నిద్రపోలేదు.

తెల్లవారింది. సూర్యుడు కొండమీదనుంచి ఎగబాకుతున్నాడు. ఊరంతా బద్ధకంగా నిద్రలేస్తోంది. మగవాళ్లింకా పడకల మీదినుంచి లేవలేదు. నిద్రలేచిన వారు అప్పటికే అరుగుల మీద చేరి మాటలు మొదలు పెట్టారు. పనులు ఏమీ లేకపోవడంతో ఏం చేయాలో ఎవరికీ తోచడం లేదు. కొందరికయితే తిక్కతిక్కగా ఉంటోంది.

ఊరికి దగ్గర్లో, దారి పక్కన తిరుపతినుంచి వచ్చి ఎవరో దాబా హోటల్ పెట్టారు. దానికి అనుకునే మందంగడి. టెండర్ పదిహేను లక్షలకు పోయిందట! ఇప్పుడు కొందరు నిద్ర లేస్తూనే టీ అంగడికి పోయినట్టుగా మందంగడికి పోతున్నారు.

పల్లె పల్లెలా లేదు.

ఆడవారు వంట చేస్తున్నందుకు గుర్తుగా ఇళ్ల చూరుల్లోంచి పొగ ఆకాశంలోకి సుడులు తిరుగుతూ పోతోంది.

శ్రీదేవి యథాప్రకారం దేవుడి దగ్గర దీపం పెట్టింది. భర్తతో కలసి తింది. సమయం పదిగంటలవుతుండగా అధికారులు, ఎమ్మెల్యే వచ్చారు. ముందుగా కృష్ణుడి గుడిలో కొబ్బరి కాయ కొట్టాడు ఎమ్మెల్యే నాగులయ్య. శ్రీదేవి ఇచ్చిన హారతిని కళ్లకు అద్దుకుని పళ్లెంలో వంద రూపాయల నోట్లు రెండు వేశాడు.

అందరూ నులకమంచాల మీద కూర్చున్నారు. ఎమ్మెల్యే మాటలు మొదలు పెట్టాడు.

''నా ప్రియమైన ప్రజలారా.. మీరు నాకు ఓట్లేసి గెలిపించారు. అందుకు చాలా ఆనందంగా ఉంది. నన్ను గెలిపించిన మీరుణం తీర్చుకుంటాను. ఆ రోజే చెప్పాను. ఈ రోజు మళ్లా చెబుతున్నాను. మీ అందరూ లక్షాధికారులు, కోటీశ్వరులు కావాల. అవన్నీ అయినాయి. ఇంగ నా చివరి కోరిక మీరందరూ సొంత మిద్దె ఇండ్లల్లో బతకాల. వానొస్తే తడుస్తా, ఎండకు ఎండుతా, చాలీ చాలకుండా ఎంత కాలం ఈ పూరిండ్లల్లో ఉంటారు. అందుకే మీ అందరికీ ఊరికి పడమరగా మైలు దూరంలో జాగా చూసినాం. అక్కడ ఒకే తావన మీ అందరికీ మిద్దిండ్లు కట్టిస్తాం. మీరంతా అక్కడికి పోవాల'' అన్నాడు.

అధికారులు మాట్లాడారు. వాటి సారాంశమేమంటే 'సెజ్ పరిధిలోకి వచ్చే ప్రాంతంలో ఆ వూరు కూడా ఉంది. అందుకని ఊరుకూడా ఖాళీ చేయాలి. అయితే వారందరికీ 'సెజ్' పెడుతున్న వారే దయతో లక్షల రూపాయల ఖర్చు పెట్టి పక్కా ఇళ్లు కట్టించి ఇస్తారు. ఆ ఇళ్లల్లో హాయిగా ఉండచ్చు. త్వరలో ఇళ్ల పనులు మొదలు పెడతారు. ఆర్నెళ్లలో అక్కడకు ఊరంతా వెళ్లిపోవాలి'.

''ఏమయ్యా సంతోషమా.., ఏమమ్మా సంతేషమే కదా..! మీకింగ పద్దన్నే లేస్తానే చెంబులెత్తుకోని గుట్టల్లోకి పోయే బాధ తప్పోతాదిలే'' అంటూ నవ్వాడు ఎమ్మెల్యే. కొందరు ఆడవాళ్లు కూడా ముసిముసిగా నవ్వారు.

వచ్చిన నాయకులు, అధికారులు వెళ్లిపోయారు.

ఇల్లు మారాలి. ఊరే వదిలేయాలి. ఆ ఊహే కొందరు భరించలేకుండా ఉన్నారు. రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

శ్రీదేవికి మనసుమనసులో లేదు. ఊరంతా మైలుదూరానికి మారిపోతే.., తమ బతుకు? తిండి పెట్టే పొలం పోయింది! ఆదరించే ఊరూ పోతా ఉంది! యిక తాము బతికేదెట్లా? ఊరుమార్చినట్టు కృష్ణుడి గుడిని కూడా మారుస్తారా? మార్చినా ముందులా భక్తితో ఆయనను ప్రజలు కొలుస్తారా? మనుషులంటే నిలదీస్తారని ఇల్లు కట్టిస్తారు కానీ, మాట్లాడని ఆదేవునికి ఎందుకు గుడి కడతారు? ఊరూ వెళ్లిపోతే తామెట్ల బతుకుతారు? రకరకాల ఆలోచనలు శ్రీదేవిలో. సాయంత్రమయింది. గుడిలో దీపం పెట్టింది. దిగులుగా కృష్ణుడినే చూస్తూ కూర్చుంది శ్రీదేవి. తమను ఆదుకోమని ఎన్నో విధాలుగా వేడుకుంది. అన్నింటికి కృష్ణుడి చిరునవ్వే సమాధానం!

''శ్రీదేవీ'' అంటూ బయటనుంచి ఎవరో కేక వేశారు. ఉలికి పాటుగా ఉరుకున బయటొచ్చింది శ్రీదేవి. మంచం దగ్గర కింద పడిపోయున్నాడు రాజయ్య. ఆయన చుట్టూ నలుగురైదుగురు గుమి కూడారు. పరుగున అక్కడకు వెళ్లింది. రాజయ్య మూతి ఎడమవైపుకు పోతోంది. ఒక కాలు చేయి కదలడం లేదు. పక్షవాతం సోకింది. అప్పటికప్పుడు తమ వూరివాళ్ల సాయంతో రాజయ్యను తీసుకుని ఆసుపత్రికి పోయింది.

మెదడులో రక్తం గడ్డకట్టిందన్నారు, పక్షవాతమన్నారు వైద్యులు. రెండు నెలలు ఆసుపత్రిలో ఉండి ఇంటి కొచ్చారు దంపతులు. అప్పులపాలయ్యారు. రెండు నెలలు గుడికి తాళం వేసి ఉండటంతో దుమ్ము పేరుకు పోయింది. ఇంటికి వస్తూనే ముందుగా గుడి వద్దకు పోయింది శ్రీదేవి. శుభ్రం చేసింది. గుడిలో దీపం పెట్టింది. గుడికి వచ్చేవారు తగ్గిపోయారు. వూర్లో చాలామంది పట్టణాలకు, నగరాలకు వెళ్లిపోయారు.

నెల రోజులు గడిచాయి. రాజయ్య మెల్లగా మాట్లాడుతున్నాడు. మాటలు స్పష్టంగా రావడం లేదు. లేచి నడిచే ప్రయత్నం చేస్తున్నాడు. శ్రీదేవి సాయంతో కర్ర పట్టుకుని నడుస్తున్నాడు.

''మే..ఏమే'' పిలిచాడు రాజయ్య.

''.....'' మంచంమీద తల ఆనించి గుడిలోని కృష్ణుడిని చూస్తూ ఆలోచనల్లో ఉంది శ్రీదేవి.

''మేయ్...'' కొంచెం గట్టిగా పిలడంతో పాటు, కదిలాడు రాజయ్య.

శ్రీదేవి ఉలికిపాటుగా తలెత్తి భర్త ముఖంలోకి చూసింది.

దాహం అన్నట్లుగా సైగ చేశాడు రాజయ్య.

భర్త మెడకింద చేతిని వేసి పైకిలేపింది శ్రీదేవి. భార్య భుజంమీద చేయి వేసి లేచి కూర్చున్నాడు. మంచం పక్కనే ఉన్న చెంబులోంచి గ్లాసులో నీళ్లు పోసి భర్తచేతికి ఇచ్చింది. అతను నీళ్లు తాగాక తిరిగి పడుకున్నాడు. మాటలు మెల్లగా వస్తున్నప్పటికీ రాజయ్య పూర్తిగా మాట్లాడటం మానేశాడు. ఎలాంటి చలనం లేకుండా మంచంపైన పడుకుని ఉంటున్నాడు. రాజయ్య ఆలోచిస్తున్నాడు అనడానికి గుర్తుగా అప్పుడప్పుడు అతని కళ్లనుంచి నీళ్లు కారుతుంటాయి.

''మన పక్కూర్లో వాళ్ల భూములు ఈమన్నేరంట. వోళ్లకు నచ్చ చెప్పేదానికి ఎమ్మెల్యే ఇప్పుడు పోతాడంట''

''నచ్చ చెప్పక పోతే ఎట్ల? ఈ మొత్తం భూముల్లో ఆయప్పకు రెండుశాతం కమీషనంట కదా!''

''అవును.. అందురూ అదే చెప్పుకుంటా ఉండారు. సుమారు ఆయప్పకు రెండు కోట్లొస్తాదంట''

ఎవరో దారిలో మాట్లాడుకుంటూ పోతున్నారు.

ఊరంతా అలజడిగా ఉంది. లక్షలు తీసుకుని పొలాలు ఇచ్చేశారు. డబ్బు చేతిలో ఎంత సేపుంటుంది? డబ్బును చూసిన కళ్లు ఊరకే ఉంటాయా? కోరికల గుర్రాలకు డబ్బు ఖర్చు కాకుండా ఉంటాదా? ఇప్పుడు ఇళ్లు కట్టిస్తారట!

ఇల్లంటే కేవలం నీడనిచ్చే గూడేనా?

ఆ ఇంటితో ఎన్నెన్ని అనుబంధాలు, ఆత్మీయతలు, ప్రేమలు ముడిపడి ఉంటాయి? వాటన్నింటినీ ఇవ్వగలరా? ఇలా ఆలోచిస్తున్న వారికి తమ

రాజయ్య తన యధాస్థితిలో ఉన్నాడు. శ్రీదేవి అతని పక్కనే నేలమీద కూర్చుంది.

'నిజంగా దేవుడున్నాడా? ఉంటే తమ కూడు పోయేదా? తమ పేగు నేల రాలిపోయేదా? ఇదంతా ఎందుకు జరగతా ఉంది? ఎవరికోసం జరగతా ఉంది? ఇట్లా ఎన్ని రోజులు? తాము మౌనంగా ఉంటే ఇంకా ఏదయినా జరుగుతుంది. ఇక ఉండటానికి లేదు. ఎదురు తిరగాల్సిందే. నాయకులు చెప్పేదొకటి చేసేదొకటిగా ఉండాది. నిలదీయాల్సిందే' అనుకుంది.

ఒకసారి గుడిలోని కృష్ణుడిని తదేకంగా చూసింది. మసక చీకటిలో ఆయన నవ్వుతున్న మోము అస్పష్టంగా కనిపించింది. భర్త పడుకోనున్న మంచానికి ఆనించి ఉన్న చేతికర్రను చేతిలోకి తీసుకుంది శ్రీదేవి. తమ ఇంటి మీదుగా పోయే ఎమ్మెల్యే, అధికారుల కోసం వీధిలో నిలబడి ఎదురు చూస్తోందామె.

ఇప్పుడామె నిప్పు కణికలా మాత్రమే ఉంది. కనిపిస్తే వాళ్ల రక్తం కళ్ల చూసేలా ఉంది.

ఊరంతా నిప్పుల కుంపటిలా ఉంది.

★

**చిరునామా :**
**సుంకోజి దేవేంద్రాచారి,**
**కేరాఫ్ భారతమ్మ, సెకండ్ ఫ్లోర్,**
**ఇం.నెం. 8-3-234/101,**
**లక్ష్మీనరసింహనగర్, యూసఫ్‌గూడ,**
**హైదరాబాద్ - 45**
**మొబైల్ : 9949118082**



## పేరులోనే అదృష్టం

ఇటీవల సినిమా వాళ్లకి 'న్యూమరాలజీ' మీదబాగా మోజు పెరిగిపోతోంది. ఆ మోజుతోనే రీమా సేన్ తన పేరులో కూడా 'ఎమ్' అనే అక్షరాన్ని అదనంగా చేర్చుకుంది. ఇంతకు ముందు 'REEMA SEN' అని ఉంటే, ఇప్పుడు అదనంగా మరో 'క చేర్చడంతో ఆమె పేరు 'RE-EMMA SEN' అయింది. పేరులో అదనంగా వచ్చి చేరిన ఈ 'క అక్షరం తనకు అదృష్టాన్ని తెచ్చిపెడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోందామె. కాకపోతే ఆమె అంటే గిట్టని కొందరు పేరులో అదనంగా అక్షరాలు చేర్చుకున్నంత మాత్రాన సినిమాలు వస్తాయా? అంటూ నవ్వుతున్నారు.